విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

దసరాకి ఊరెళ్లేవారు పోలీసు స్టేషన్‌లో తెలియజేయండి

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండల ఎస్సై ఎ సుబ్బరాజు మండల ప్రజలకు దసరా పండుగ సందర్భంగా పలు సలహాలు సూచనలు తెలిపారు. పండుగ నిమిత్తం స్వగ్రామానికి వెళ్ళేవారు తప్పకుండా స్థానిక పోలీస్ స్టేషన్లో తెలియజేయాలన్నారు. లేదంటే తిరిగి వచ్చాక కంగుతినే పరిస్థితి ఎదురు కావచ్చని అన్నారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లు లక్ష్యంగా దొంగలు రెచ్చిపోయే అవకాశం ఉంటుందని కొమరోలు ఎస్సై ఏ.సుబ్బరాజు హెచ్చరిస్తున్నారు. కనుక ఇలాంటి పరిస్థితులు ఎదురవకుండా ముందుగానే స్థానిక పోలీస్ స్టేషన్లో తెలియజేయాలని అన్నారు.

పేదలకు వరం వైఎస్సార్ భీమా

విశాలాంధ్ర-పామూరు : స్థానిక ఆకుల వీధికి చెందిన కటకం శంకర్ అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం వైఎస్సార్ భీమా పథకం కింద పదివేల రూ.లను మృతుడు భార్య కటకం అనూషకు మండల వైసీపీ యువజన అధ్యక్షులు, పట్టణ ఉప సర్పంచ్ యాదాల వెంకట సాయికిరణ్ చేతల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పట్టణ వైసీపీ నాయకులు గద్దె శేషు, కటకం శివలు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : దారా అంకయ్య 40వ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని మట్టిగుంట గ్రామంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళ నాయకులు దారా పద్మజ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఒంగోలులోని ప్రముఖ ఆసుపత్రులు కిమ్స్ వైద్యశాల, డాక్టర్ ప్రసాద్ మల్టిసూపర్ స్పెషాలిటీ వైద్య శాల, రిమ్స్ వైద్యశాలకు చెందిన ప్రముఖ వైద్యులు ఈ వైద్యశిబిరంలో సేవలు అందించి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు. వైద్యశిబిరం ప్రారంభించడానికి మాజీ మంత్రివర్యులు బాలినేని శ్రీనివాసరెడ్డితో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు రానున్నట్లు దారా పద్మజ తెలిపారు.

చంద్రబాబు ప్రాణాలకు రక్షణ కల్పించాలి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాణాలకు రక్షణ కల్పించాలని అలానే ఆయన భద్రతపై తక్షణమే గవర్నర్ కేంద్రం జోక్యం చేసుకోవాలని కనిగిరి నియోజకవర్గ హనుమంతునిపాడు మండల పరిధిలోని ఉన్న నందనవనం గ్రామానికి చెందిన రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ముమ్వా రంగసాయి యాదవ్ శనివారం రంగ సాయి డిమాండ్ చేశారు. అలానే చంద్రబాబు ప్రాణాలతో వైకాపా ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ముమ్వ రంగసాయి యాదవ్ అన్నారు.

ఆలయాలు ముస్తాబు



నేటి నుంచి శరన్నవ రాత్రి ఉత్సవాలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నేటి నుంచి ఘనంగా నిర్వహించనున్న నేపథ్యంలో మండలం లోని పలు గ్రామాల్లోని దేవాలయాలు ముస్తాబు చేశారు. 15వ నుండి 23 తేదీ వరకు నిర్వహించే ఉత్సవాలలో అమ్మవార్లు కొలువు ధీరనున్నారని ఈదర అష్ట పద్మాల అంకమ్మ తల్లి దేవస్థానం అర్చకులు నాగ మల్లి రమణయ్య శనివారం తెలిపారు. ఉత్సవాలకు ఈదర, పసుపు గళ్ళు, పెద ఉల్ల గల్లు, పులిపాడు, మారెళ్ళ, పోలవరం, ఉమామహేశ్వరపురం, పలు దేవాలయాలు ముస్తాబయ్యాయి.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

విశాలాంధ్ర-కంభం: కంభం కోటా సత్యమాంబ దేవి దేవస్థానంలో దసరా నవరాత్రులు ప్రారంభమవుతున్న శుభ సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గ శాసన సభ్యులు అన్నా వెంకట రాంబాబును తన నివాసం దగ్గర కోటా సత్యమాంబ దేవి దేవస్థానం కమిటీ సభ్యులు అన్నా రాంబాబును శాలువాతో సన్మానించి కోటా సత్యమాంబ దేవి దేవస్థానంలో జరుగు దసరా నవరాత్రులకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వాన పత్రికతో ఆలయ కమిటీ నరసింహ, కోటి, తదితరులు ఆహ్వానించారు.

వైసీపీ సీనియర్ నాయకులు మాలకొండారెడ్డి మృతి



విశాలాంధ్ర-పామూరు : మండలంలోని కంబాల దిన్నె గ్రామానికి చెందిన పిచ్చాల మాలకొండారెడ్డి శుక్రవారం రాత్రి గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. మాల కొండారెడ్డి మృతి వైసీపీకి తీరని లోటని ఎంపీపీ గంగసాని లక్ష్మీ హుస్సేన్‌రెడ్డి దంపతులు సంతాపం వ్యక్తం చేశారు.

నేటి నుంచి చదవడం నాకిష్టం

విశాలాంధ్ర-టంగుటూరు : స్థానిక శాఖా గ్రంధాలయం దసరా పండుగ సందర్భంగా ఈ నెల 15 నుండి 24వ తేదీ వరకు చదవడం నాకిష్టం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రంథ పాలకులు గుమ్మడి వర్ధన్‌రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాసరచన, పోటీలు కథలు చెప్పించటం, పాటలు పాడించటం, వ్రాయించటం వారిలోని సృజాత్మకతను వెలికితీసి ఆ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు చివరి రోజున బహుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగిని పరామర్శించిన ముత్తుముల

విశాలాంధ్ర-కంభం : కంభం పట్టణంలో ఆనారోగ్యంతో బాధ పడుతూ ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్న రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి దస్తగిరిని గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ ముత్తుముల అశోక్ రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకుని డాక్టర్‌ల సలహాలు, సూచనలు, ఇచ్చారు. కంభం తెలుగుదేశం పార్టీ నాయకులు పరామర్శించారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-పెద్దారవీడు : జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పేద వారి జీవితాల్లో వెలుగు నింపి వారి తలరాతను మార్చాలన్నదే సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి లక్ష్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. పెద్దారవీడు మండలం గొబ్బూరు గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్ల కాలంలో ఎంతెంత లబ్ధి పొందారో వివరాలతో కూడిన బుక్లెట్ను లబ్దిదారులకు అందించారు. స్థానికులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాల మెరుగు కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో లంచాలకు, వివక్షాలకు తావులేకుండా, కార్యాలయాల చుట్టూ తిరిగే దుస్థితి లేకుండా గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసున్నట్లు తెలిపారు. జగనన్న మేనిఫెస్టోలోని ప్రతి హామీని అమలు చేసి ప్రజల గుండెల్లో దేవుడిగా నిలిచిపోయారని, అన్ని వర్గాలు అభివృద్ధి చెందాయని, ప్రతి గడపలోనూ సంతోషం వెల్లి విరుస్తోందన్నారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వానికి, గత చంద్రబాబు ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాలను ప్రజలు గమనించాలని, కేవలం అధికారం దాహంతో మోసగాళ్లు ఒక్కటై సీఎం జగనన్నును ఎదుర్కోవాలని చూస్తున్నారని పేర్కొన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ప్రతి పక్షాల కడుపు ఎందుకు మండిపోతోందో అర్థం కావడం లేదని విమర్శించారు. దేశంలోని ఏ రాష్ట్రంలో చేపట్టని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ ఫలాలు అందిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు, జగనన్నే మా ధైర్యమే అంటున్నారని తెలిపారు. మోసం చేయడం చంద్రబాబు నైజం చెప్పిన మాటకు కట్టుబడి చిత్తశుద్ధితో హామీలు అమలు చేయడంలో సీఎం వైఎస్ జగన్మో హన్‌రెడ్డి నైజమని అన్నారు. అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, తదితర నవరత్నాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని, ప్రజా శ్రేయస్సు ధ్యేయం గా జగనన్న పాలన సాగిస్తున్నారని వివరించారు.

వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదరించి మరోసారి సీఎం చేసుకుంటే మరెన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అదుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, జడ్పిటిసి ఏరువా చలమారెడ్డి ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య సర్పంచ్ అంగిరేకుల ఆదినారాయణ యాదవ్ వైస్ ఎంపీపీ గుండారెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వర్ రెడ్డి, తహశీల్దార్ వెంకట కృష్ణారెడ్డి, ఎంపీడీవో రాజ్ కుమార్ మండల అగ్రికల్చర్ అధికారి బుజ్జి బాయ్, విద్యుత్ ఏఈ రమేష్, ఏపీఓ సాంబ శివయ్య, ఎపీఎం శ్రీని వాసులు, పంచాయతీ రాజ్ ఏఈ రవీంద్ర రెడ్డి, సర్పంచులు రమేష్, సుబ్బయ్య, చిన్నోడు, ఆదం, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు వల్లెల ఈశ్వర్‌రెడ్డి, సరాల రామచంద్ర యాదవ్, రెల రణరెడ్డి, శొంఠి నాగార్జునరెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించండి..

- ప్రాణాలను కాపాడుకోండి..
- సబ్ ఇన్స్‌పెక్టర్ కోటేశ్వరరావు

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : మార్కెట్ యార్డు సమీపంలో గల జాతీయ రహదారిపై పట్టణ సబ్ ఇన్స్‌పెక్టర్ కోటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేశారు. హెల్మెట్ ధరించకుండా సరైన పత్రాలు లేకుండా అతివేగంగా వెళుతున్న వాహన చోదకులకు ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సబ్ ఇన్స్‌పెక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనంపై ప్రయాణించరాదని, సరియైన పత్రాలు లేకుండా రోడ్డుపైకి వాహనాలను తీసుకురాకూడదని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తగు జాగ్రత్తలు వహిస్తూ రహదారులపై వాహనాలను నడపాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా రహదారులపై ప్రయాణించడం నేరమని అట్టి వారిపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అవసరాలపై నిత్యం ప్రయాణం చేసే వాహన చోదకులు క్షేమంగా గమ్యం చేరాలంటే తప్పనిసరిగా జాగ్రత్తలు వహించాలని కోరారు. ఈ తనిఖీలలో ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణుడు, హెడ్ కానిస్టేబుల్ అల్లావుద్దీన్, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

సర్పంచ్ సుబ్బయ్యకు నివాళులు : మంత్రి సురేష్

విశాలాంధ్ర-పుల్లలచెరువు : మండలంలోని మల్లపాలెం సర్పంచ్ మంగినపల్లి సుబ్బయ్య పార్ధీవదేహానికి రాష్ట్రపురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శనివారం నివాళులర్పించారు. శుక్రవారం సర్పంచ్ సుబ్బయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మంత్రి సురేష్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. సుబ్బయ్య మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటు అన్నారు. సుబ్బయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన కుటుంబానికి వైసీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

దివాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

విశాలాంధ్ర-కనిగిరి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని శ్రీ సాయి కృష్ణ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు దోసపాటి నరసయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గూగుల్ కంప్యూటర్ ఆవరణలో శ్రీ సాయి కృష్ణ దివ్యాంగుల సంక్షేమం కార్యాలయంలో దివ్యాంగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే దివ్యాంగులు ఉద్యోగాలు, ఉపాధి లేక మానసి కంగా ఇబ్బంది పడుతు న్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దివ్యాంగులు డిగ్రీ,పీజీ, పీ.హెచ్. డి చదువులు చదివి ఉద్యోగ అవకాశాలు లేక ఉద్యోగం కోసం ఎదురుచూస్తూ నిరాశకు గురవుతున్నారనీ ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులపై దృష్టి సాధించి ఐదు శాతం ఉద్యోగాల్లో , ఉపాధి అవకాశాల్లో కల్పించి వారి జీవన నైపుణ్యాన్ని మెరుగుపరచాల అన్నారు. ప్రభుత్వ మేనిఫెస్టో ప్రకారం 21 రకాల దివ్యాంగులను ప్రభుత్వ పథకాలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ రెడ్డి సంధ్య, కనిగిరి మండల దివ్యాంగుల అధ్యక్షులు పాలూరి వెంకటేశ్వర్లు,సెక్రెటరీ ఇండ్ల రమణయ్య, ఉపాధ్యక్షులు ఇంద్ర కంటి దేవ సహాయం, శ్రీధర సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఊరికి వెళ్లేవారు సమాచారం అందజేయాలి - ఎస్సై మహేష్

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలం లోని ఆయా గ్రామాల్లో ప్రజలు దసరా పండుగకు సొంత గ్రామాలకు వెళ్లే వారు సమాచారాన్ని సంబంధిత పోలీస్ స్టేషన్లో సమాచారాన్ని అందజేయాలని ఎస్సై వెలగ మహేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంత ప్రజలకు దసరా పండుగకు ఊర్లకు వెళ్లేవారు తప్పకుండా మీ సమీపంలోని సచివాలయంలో, పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు. ప్రజలకు దసరా పండుగ సందర్భంగా పలు సలహాలు సూచనలు తెలిపారు. పండుగ నిమిత్తం స్వగ్రామానికి వెళ్ళేవారు తప్పకుండా స్థానిక పోలీస్ స్టేషన్లో తెలియజేసి వెళ్ళాలని తెలిపారు.లేదంటే తిరిగి వచ్చాక కంగుతినే పరిస్థితి ఎదురు కావచ్చు అని అన్నారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లనే దొంగలు లక్ష్యంగా చేసుకొనే అవకాశం ఉంటుందన్నారు.

గతంలో పండుగలకు తాళాలు వేసి సొంతూరికి వెళ్లిన వారి ఇళ్లలో దొంగలు దోచుకుపోయిన ఘటనలు ఉన్నాయని, తరచూ పండు గల సమయంలో ఊరు వెళ్లి తిరిగి వచ్చాక దొంగతనం ఫిర్యాదులు అధికంగా అందుతుంటాయని, కనుక ఇలాంటి పరిస్థితులు ఎదురవకుండా ముందుగానే స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం తెలియజేయాలని ఆయన తెలిపారు.

గుడిపాటి పల్లికి బస్సు పునరుద్ధరించండి

విశాలాంధ్ర-వెలిగండ్ల : కనిగిరి నుండి తురకపల్లి మీదుగా గుడిపాటి పల్లికి బస్సు సౌకర్యం పునరుద్ధరిం చాలని వైసీపీ నాయకులు కటికల వెంకటరత్నం, సింగిల్ విండో అధ్య క్షులు కాకర్ల వెంకటేశ్వర్లు ఎంపీటీసీ పాప బత్తిన నాగేశ్వరరావు డీఎంకి వినతిపత్రం అందజేశారు. శనివారం కనిగిరిలోని ఆర్టీసీ డిపో నందు గుడిపాటి పల్లి తురకపల్లి కూటగుండ్ల తదితర గ్రామాల ప్రజలు నాయకులు డిపో మేనేజర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉన్న సర్వీసులు పునర్ధరించి రవాణా సౌకర్యం కల్పించాలని బస్సు లేక ఆ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, కొన్ని రోజులుగా గుడిపాటి పల్లి సర్వీసును నిలుపుదల చేయడంతో ప్రజలు రాకపోకలకు ఆటంకం ఏర్పడింద న్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు దుగ్గెంపూడి రామిరెడ్డి, దిబ్బమడుగు వెంకటేశ్వర్లు, పూలు కూరి నీలార్మ స్ట్రాంగ్, అన్నపురెడ్డి జయరాంరెడ్డి, కాకర్ల రమణయ్య, ఎంపీటీసీ నాగేశ్వరరావు, పాపిజెన్నీ రమణారెడ్డి, సెక్రెటరీ పద్మ, కూటగుళ్ల, ముప్పళ్లపాడు, గుడిపాటిపల్లి గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

బీసీ కులాల కార్పొరేషన్ల వలన బీసీలకు ఒరిగిందేమిటి?

గౌరవ వేతనానికి పరిమితమైన చైర్మన్లు,డైరెక్టర్లు ఉద్యమకారులును ఉద్యోగులుగా మార్చిన జగన్ ఓ.బీ.సీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వీరభద్రాచారి

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం రెండున్నర ఏళ్ల క్రితం పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన 56 బీసీ కులాల కార్పొరేషన్ల వలన నాటి నుండి నేటి వరకు ఆయా కులాల బీసీ ప్రజలకు ఒరిగిందేమీ లేదని, ఒకవేళ ఒరిగిందేమీటో ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు ప్రజలకు తెలిసేలా శ్వేత పత్రం విడుదల చేయాలని ఓ.బి.సి.సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి.వీరభద్రాచారి డిమాండ్ చేశారు. శనివారం సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు కుల సంఘాల నాయకులు గా,ప్రజాసంఘాల ఉద్యమ నాయకులు గా ఉండే వారికి భవిష్యత్తులో నోరెత్తకుండా చైర్మన్, డైరెక్టర్ లాంటి పదవులు,యాభై,పదమూడు వేలు గౌరవం లేని గౌరవ వేతనం ఇస్తూ ప్రభుత్వ పథకాలను ప్రచారం చేసే ఉద్యోగులుగా మార్చారని ఎద్దేవా చేశారు.ఒకరకంగా బీసీ లుగా ఉన్న అన్ని కులాలను ఒక్కొక్కటిగా విడదీసి బీసీల ఐక్యతను జగన్మోహనరెడ్డి పథకం ప్రకారం దెబ్బతీసారని వీర భద్రా చారి అభిప్రాయపడ్డారు.గత నాలుగున్నర సంవత్సరాలలో ఓసి లకు వచ్చే సాధారణ ప్రయోజనాలే బీసీ లకు వచ్చాయి తప్ప బీసీ సంక్షేమం కోసం కొత్తగా ప్రభుత్వం,కార్పొరేషన్ల ద్వారా వచ్చింది ఏమీ లేక పోగా గతంలో ఉన్న బీసీ సంక్షేమ పథకాలకు మంగళం పాడిన ఘనత వైసీపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి కి దక్కుతుందన్నారు. బీసీలు చైతన్యవంతులై వాస్తవాలు అవగాహన చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు ప్రకాశరావు, మాల్యాద్రి, ప్రభాకర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్లో ముందస్తు దసరా సంబరాలు

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : స్థానిక ధారావారి తోటలో ఉన్న నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నందు దసరా పండుగ సంబరాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. పండుగ సంబరాలలో భాగంగా విద్యార్థిని విద్యార్థులు అమ్మవార్ల వేషధారణలు, రాముడు, సీతలతో అలరించారు. సంప్రదాయ నృత్యాలతో, బొమ్మల కొలువులతో కన్నుల పండుగగా జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ వేదవతి పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి పండుగ ప్రత్యేకతను గురించి తెలిపారు. ముఖ్యంగా ఎపట్టికనా చెడుపై మంచి గెలుస్తుందని అందరూ మంచిగా ధర్మంగా ఉండాలని ఎన్నో మంచి విషయాలను తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏజీఎం పెద్దిరెడ్డి, అధ్యాకులు, తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేశారు.

పూజారి రామకృష్ణ శర్మను తొలగించాలి

కొత్త పూజారిని నియమించాలని డిమాండ్ చేస్తున్న గ్రామస్తులు

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : ఉప్పుగుండూరు గ్రామంలోని చారిత్రక శివాలయంలో ప్రస్తుతం పని చేస్తున్న పూజారిని మార్చి కొత్త పూజారిని నియమించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. శివాలయ పూజారి రామకృష్ణ శర్మ భక్తులను తన ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ పైసాచికత్వం ప్రదర్శిస్తున్నాడని డబ్బులు ఇవ్వనిదే పూజలు చేయటం లేదని తక్షణమే ఆయనను తొలగించి మరొక పూజారిని నియమించాలని కోరుతూ శనివారం శివాలయంలో దేవస్థానం ఈవో మీనిశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో సమావేశం నిర్వహించారు. పూజారి రామకృష్ణ శర్మ చర్యలను గ్రామస్తులు దేవస్థానం ఈవో మేనిశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లి తక్షణమే తొలగించాలని పట్టుబట్టారు. దాంతో ఇప్పటికిప్పుడు పూజారిని తొలగిస్తే పూజాది కార్యక్రమాలకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఇక్కడ పనిచేసేందుకు మరో పూజారి వచ్చేవరకు పాత పూజారినే కొనసాగించాలని సూచించారు. దాంతో గ్రామస్తులు శివాలయంలో పనిచేసేందుకు కొత్త పూజారి సిద్ధంగా ఉన్నాడని తక్షణమే ఆయనను విధుల్లోకి తీసుకొని రామకృష్ణ శర్మను విధుల్లో నుంచి తొలగించి దేవాదాయ శాఖ ద్వారా ఎప్పటిలాగే జీతభత్యాలు అందించాలన్నారు. నిరంతరం శివాలయంలో పూజాది కార్యక్రమాలు కొనసాగించాలని ఏకగ్రీవంగా కోరారు.ఆదివారం నుండి నవరాత్రులు మొదలవుతున్న సందర్భంగా తొమ్మిది రోజులు కొత్త పూజారిని నియమించాలని డిమాండ్ చేశారు. ఎండోమెంట్ ఈవో మాట్లాడుతూ నవరాత్రుల సందర్భంగా కొత్త పూజారి నియమించి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు అనంతరం ఒక నెల రోజుల్లో ప్రస్తుతం ఉన్న పూజారిని పూర్తిగా తొలగించి కొత్త పూజారిని నియమిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాదాసు రాంబాబు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు కొంజేటి వెంకట సురేష్ బాబు ఎంపీటీసీ మున్నంగి వెంకటరావు శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పేరాల చెన్నకేశవులు, అమరా వేణు గోనుగుంట వీర బ్రహ్మచారి కాట్రగడ్డ చంద్రబాబు, గోగినేని ఆంజనేయులు ఓరుగంటి దత్తాత్రేయ పంతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా సజ్జ దిగుబడులు

విశాలాంధ్ర-తాళ్లూరు : 2023 ఖరీఫ్ సీజన్లో భాగంగా వర్షాధార పంటగా రైతులు పండించిన సజ్జ పంట దిగు బడులు ఆశాజనకంగా ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి బి ప్రసాద్‌రావు అన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా శనివారం ఆయన దోసకాయలు పాడు గ్రామంలో పర్యటించి సజ్జ నూర్పిళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ తాళ్లూరు మండలంలో 896.5 ఎకరాల విస్తీర్ణ ంలో సజ్జ పంటను పండించారని అది ఇప్పుడు కోత దశకు చేరుకుందని, కొన్నిచోట్ల నూర్పిళ్ళు కూడా చేస్తున్నారని సరాసరి ఎకరాకు 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో సజ్జలు క్వింటా 2600 రూపా యల నుండి 2700 వరకు ధర పలుకుతుందని రేట్లు కూడా అనుకూలంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు భార్గవి, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకం ప్రజా ఓటింగ్

విశాలాంధ్ర-దర్శి : దర్శి పట్టణంలో పెరిగిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా దర్శి నగర పంచాయతీ గడియార స్తంభం సెంటర్లో సీపీఐ, సీపీఎం ఆధ్వ ర్యంలో శనివారం సాయంత్రము ప్రజా బ్యాలెట్ ద్వారా ఓటింగ్ ను కోరారు. ప్రభుత్వాలు పెంచిన విద్యుత్ ఛార్జీలు ప్రజలకు అనుకూలమా వ్యతిరే కమా అని ప్రజా బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించడం జరిగిందని సీపీఐ నాయకులు మంద పకుల రమేష్ అన్నారు. మొత్తం 202 మంది ఓటింగ్ లో పాల్గొనడం జరిగింది. వ్యతిరే కంగా 92 మంది ఓటింగ్ చేయగా ఏడుగురు అనుకూలంగా ఓటింగ్ వేశారు. మూడు ఓట్లు మురిగిపోయాయి. కార్యక్రమంలో దర్శి నియోజకవర్గం సీపీఐ పార్టీ కార్యదర్శి మాడపాకుల రమేష్ బాబు, సీపీఐ టౌన్ శాఖా కార్యదర్శి జూపల్లి కోటేశ్వరరావు, దర్శి నియోజకవర్గం సీపీఐ సహాయ కార్యదర్శి కే హనుమంతరావు, సీపీఐ నియోజకవర్గ కమిటీ సభ్యుడు ఆర్ కరుణానిధి, సీపీఎం పార్టీ డివిజన్ కార్యదర్శి టి రంగారావు, ఉప్పు నారాయణ, టి రంగనాయకులు, గోగు వెంకయ్య, కెవి పిచ్చయ్య పాల్గొన్నారు.

వీల్ చైర్ అందించిన వైద్యులు మురళీకృష్ణ

వీల్ చైర్ను అందిస్తున్న వైద్యులకు మురళీకృష్ణ

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరికి చెందిన ప్రముఖ వైద్యులు పెరుగు మురళి కృష్ణ సతీమణి వైద్యురాలు యన్నాబత్తిన హరిత జన్మదిన సందర్భంగా స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లింగారెడ్డిపల్లికి చెందిన సీమోనుకు వీల్ చైర్ శనివారం అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మురళీకృష్ణ మాట్లాడుతూ అభాగ్యులకు ఆసరాగా నిలుస్తున్న స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సుధీర్ బాబు సేవ ఎనలేనివని అన్నారు. సుధీర్ బాబు మాట్లాడుతూ 11 సంవత్సరాలుగా మంచానికే పరిమితమైన సీమేనుకు వీల్ చైర్ అందజేయటం పెరుగు మురళీకృష్ణ యన్నాబత్తిన హరిత కు కృతజ్ఞతలు తెలిపారు. సీమోను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని చెప్పారు .ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణ దంపతులు,విద్యాధర్, బాల కృష్ణ, మేకల శ్రీను స్నేహహస్తం సభ్యులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ విద్యార్థి, ఉపాధ్యాయులకు నగదు బహుమతి

విశాలాంధ్ర-పుల్లలచెరువు : జాతీయ స్థాయి లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన పుల్లల చెరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నిఖిల్ చంద్, గైడ్ మాస్టర్ ఎస్.కె.మస్తానవలిలకు రాష్ట్రపురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ నగదు బహుమతిని శనివారం అందజేశారు. జాతీయ స్థాయిలో ఇన్స్పయిర్ అవార్డ్ పొందినందుకు విద్యార్థి నిఖిల్ చంద్, టీచర్ మస్తాన్ వలిలకు చెరొఐదు, పదివేల రూపాయల నగదు ను మంత్రి సురేష్ అందించారు. విద్యార్థి, టీచర్లను మంత్రి అభినందిం చారు. కార్యక్రమంలో హెచ్.ఎం.ఉమామహేశ్వరరావు, వై.పాలెం తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు షేక్.జానీ బాషా పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి దేవస్థానమును సందర్శించిన గంగసాని దంపతులు

విశాలాంధ్ర-పామూరు : శ్రీకాళ హస్తి దేవస్థానమును ఎంపీపీ గంగ సాని లక్ష్మీ హుస్సేన్‌రెడ్డి దంపతులు శనివారం సందర్శిం చారు. పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు మెంబర్ జైశ్యాం రాయల్ గంగసాని దంపతులకు ఆహ్వానం పలికి వేద పండితుల ఆశీర్వచనాలతో సత్కరించి తీర్థ ప్రసాదములు అందజేశారు. మండల ప్రజలు ఎల్లప్పుడు సుఖ సంతోషాలతో ఉండాలని దేవుని కోరుకున్నట్లు ఎంపీపీ దంపతులు గంగసాని లక్ష్మి హుస్సేన్‌రెడ్డి తెలిపారు.

గిద్దలూరులో 17 నుండి యోగా శిక్షణ కలదు

విశాలాంధ్ర-గిద్దలూరు : ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో గిద్దలూరులోని శ్రీ శ్రీ భగవాన్ కాశిరెడ్డి నాయన ఆశ్రమమునందు 17 నుండి 21 వరకు ఉదయం 5:45 నుండి 7:45 వరకు 18 సవత్సరముల పై బడిన స్త్రీ పురుషులు పాల్గొనవచ్చును. నవరాత్రులు దశరా సెలవుల సందర్భంగా యోగా శిక్షణ ఏర్పాటు చేస్తున్నారన్నారు. అందులో భాగంగా గిద్దలూరులో కూడా ఏర్పాటు చేస్తున్నామని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్స్ పాలుగుల్ల పురుషోత్తంరెడ్డి, బి యస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో పాల్గొనే వారికి ఆరోగ్యవంతమైన శరీరము ఒత్తిడి లేని జీవితము ఒత్తిడిని అధిగమించి ఆనందంగా జీవించే ప్రక్రియ అపారమైన జ్ఞానము సుదర్శన క్రియ నేర్పిస్తారన్నారు. అందులో భాగంగా సూక్ష్మ ప్రాణాయామము వేరు బివేరు చిన్నబిచిన్న ప్రాణాయామాలు మనిషికి అవసరమైన యోగాసనాలు త్రీ స్టేజి ప్రాణాయామము, ఊపిరితిత్తులు శుద్ధి చేసుకోవడానికి బస్త్రికా ప్రాణాయామముతో పాటు మనిషికి అవసరమైన జీవన విధానాన్ని నేర్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని గిద్దలూరు పట్టణము, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణలో పాల్గొనదలచిన వారు ముందుగా ఆన్లైన్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు పూర్తి వివరాలకు 9441932390,9959394824 సెల్ నెంబర్స్ ని సంప్రదించాలన్నారు.

ముమ్మరంగా పొగనట్లు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలో ఈ మధ్య కురిసిన వర్షాలకు రైతులు ముమ్మరంగా పొగనాట్లు వేస్తున్నారు. వాణిజ్య పంటలు ఆహార పంటలకు సాగు చేసేందుకు అదును దాటిపోవడంతో గత్యంతరం లేక అధిక విస్తీర్ణంలో పొగాకు నాటుతున్నారు. ఇప్పటివరకు కొన్నిచోట్ల మాత్రమే పత్తి, సజ్జ, జొన్న, కంది, పెసర, మిరప, సాగు చేశారు. బర్లీ పొగాకు ఎకరంలో నాట్లు వేయాలంటే సుమారు 26 వేలు ఖర్చు అవుతుందని రైతులు తెలుపుతున్నారు. ఎకరాకు పొగనారు 5000 వేలు, దుక్కి 2000 వేలు, సాలు ఇరవాలు గొర్రు1600, కూలీలు3600, అచ్చు800, మందు 10000 వేలు, నీటి తడులు4500 వేలు ఇలా ఎకరాకు26700 ఖర్చవుతుందని రైతులు తెలిపారు. ఒకవైపు పొగనాట్లు, మిరప నాట్లు, ఇంకోవైపు వరినాట్లు పనులు ఒక్కసారిగా ప్రారంభించడంతో కూలీల కొరత కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. నాట్ల కోసం వాగుల్లో వంకల్లో కుంటలలో బోర్ల వద్ద నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తున్నారు.

విజయమ్మను కలసిన తాళ్లూరు ప్రజా ప్రతినిధులు

విశాలాంధ్ర-తాళ్లూరు : దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి సతీమణి వైయస్ విజయ మ్మను శని వారం జెడ్పీటీసీ మారం వెంకట్‌రెడ్డి తదితరులు కలిశారు. ఒంగోలు వచ్చిన సందర్భంగా విజయ మ్మ ను జెడ్పిటిసి మారం వెంకట్‌రెడ్డి కలిసి పుష్ప గుచ్చం అందించి అభినందనలు తెలిపారు. కార్య క్రమంలో బెల్లంకొండ వారి పాలెం సర్పంచ్ పి సుమలత శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

టి కృష్ణ 37వ వర్ధంతి కార్యక్రమాలు

ఈనెల 20, 21 తేదీలలో క్విజ్, పాటలు పోటీలు

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రజానాట్యమండలి కళాకారుడు, సంచలన సినీ దర్శకుడు టి కృష్ణ 37వ వర్ధంతి కార్యక్రమాలు ఈ నెల 20 21 తేదీలలో ఒంగోలు సివిఎస్ రీడింగ్ రూమ్‌లో జరుగుతున్నాయని టి కృష్ణ మెమోరి యల్ కల్చరల్ సొసైటీ కమిటీ సభ్యులు పివిఆర్ చౌదరి శనివారం తెలిపారు. 20వ తేదీన క్విజ్ పోటీలు ఉదయం 9 గంటలకు జూనియర్స్‌కు హై స్కూల్ విద్యార్థులు, అనంతరం సీనియర్స్ కాలేజీ విద్యార్థులకుక్విజ్ జరుగును. 21వ తేదీన పాటల పోటీలు ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమగును. ఈ పోటీలలో హైస్కూలు, కాలేజీ విద్యార్థులు పాల్గొనవచ్చు అన్నారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు సినీ హీరో గోపీచంద్ ఆర్థిక సహాయం కూడా అందజేస్తున్నారన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు 21వ తేదీ సాయంత్రం జరుగు బహిరంగ సభలో టి కృష్ణ తనయుడు సినీ హీరో గోపీచంద్ చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేయబడునని తెలిపారు.

కొండారెడ్డిపల్లిలో మన ఊరు మన ఉగ్ర

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : కనిగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ మరియు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో శనివారం కొండారెడ్డిపల్లి గ్రామంలో ఆగ్రామ పార్టీ అధ్యక్షులు గుమ్మా కొండయ్య అధ్యక్షతన మన ఊరు మన ఉగ్ర ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని కొండారెడ్డిపల్లి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ పాంప్లెట్ అందజేస్తూ బాబుకు తోడుగా నేను సైతం అంటూ ప్రజలతో మాట్లాడుతూ నాలుగున్నర ఏళ్ల వైసీపీ పాలనలో ఒక్క అభివృద్ధి కూడా చేయటం చేతకాని ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన చంద్రబాబు ఎటువంటి ఆధారాలు లేని స్కిల్ డెవలప్మెంట్ కేసులో బాబును జైలులో పెట్టి జగన్‌రెడ్డి తన శాడిజం చూపిస్తున్నారని జగన్ శాడిజాన్ని అరాచకాలను బాబుతో నేను కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్లి ప్రజలకు ఉగ్ర నరసింహారెడ్డి వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి,మాజీ మండల పార్టీ అధ్యక్షులు గాయం తిరుపతిరెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి మురహరి నరసయ్య,గాయం రామిరెడ్డి, కందుల వెంకట సుబ్బారెడ్డి, చీకటి వెంకట సుబ్బయ్య, కోటపాటి శేషయ్య,గంగిరెడ్డి రమేష్ రెడ్డి,గాయం కృష్ణారెడ్డి, బ్రహ్మంగౌడ్,యలనాటి చినకోటయ్య,బలసాని కోటయ్య,మాసేపోగు ఎర్రయ్య,యలనాటి చిన్న కోటయ్య,మోర శశికాంత్ రెడ్డి, కూరాకు బాల నారాయణ, కొండపురెడ్డి రమణారెడ్డి, కృపయ్య,వెంకటస్వామి,టీచర్ దాసు,పగడాల శ్రీరాములురెడ్డి, ఆవులయ్య,సానికొమ్ము బ్రహ్మారెడ్డి,గోరా వెంకట రంగయ్య, మరియు తదితర కొండారెడ్డిపల్లి టీడీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చంద్రబాబు నిర్దోషి విడుదల కావాలని పూజలు

విశాలాంధ్ర-దర్శి : తెలుగు దేశం పార్టీ జాతీయ నాయకులు చంద్రబాబు అక్రమ అరెస్ట్ కేసులో రిమాండ్ నుండి క్షేమంగా ఆయురారోగ్యాలతో నిర్దోషిగా బయటకు రావాలని చలివేంద్రం కొండపై వెంకటేశ్వర స్వామి దేవాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పూజా కార్యక్రమం నిర్వహించి కొబ్బరికాయలు వారి కోర్కెలను నెరవేర్చాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చిట్టి వెంకటేశ్వర్లు, పార్లమెంట్ ఉపాధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు గొర్రె సుబ్బారెడ్డి, కామిరెడ్డి వెలుగొండా రెడ్డి,అనంత కృష్ణయ్య, సుబ్బారావు, సాంబయ్య, క్లస్టర్ ఇంచార్జి నానబాల అంకయ్య, పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూప్ మహిళలకు పెరటి కోళ్ల పంపిణీ

విశాలాంధ్ర-తర్లుపాడు : తర్లు పాడు మండలంలోని స్త్రీ శక్తి భవన కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ క్రాంతి పదం వారి ఆధ్వర్యంలో మహిళా సంఘ సభ్యులకు 100 యూనిట్లకు పెరటికోళ్లను పంపిణీ కార్యక్రమాన్ని ఏపిఎం డి పిచ్చయ్య ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకం ద్వారా వచ్చే గుడ్లను ముఖ్యంగా గర్భవ తులు బాలింతలు చిన్న బిడ్డలకు ఎంతగానో ఆరోగ్యపరంగా ఉపయోగ పడతాయన్నారు. అనంతరం కార్యక్రమంలో ఏపీఎం. డి పిచ్చయ్య సాయిలు సంఘ మహిళలకు పెరటి కోళ్లను, సంబంధించిన ఫీడ్ ఫుడ్‌ను అందించడం జరిగింది. కార్యక్రమంలో వివోఏలు మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్లు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : దోర్నాల ఎంపీపీ గుమ్మ పద్మజ యల్లేష్ యాద వ్‌ల కుమారుడు ధీరజ్ శ్రీ కృష్ణ యాద వ్ 7వ జయంతి సందర్భంగా మండ లంలోని గిరిజన చెంచు గుడాలలో తుమ్మల బైలు, చింతల గ్రామలలో గిరిజనలకు దుప్పట్లు, పండ్లను పంపిణి చేయడం జరిగింది. ఎంపీపీ ధీరజ్ శ్రీ కృష్ణ ఫౌండేషన్ అధ్వర్యంలో రాబోవు రోజుల్లో పెద్ద ఎత్తున ఇలాంటి కార్యక్రమాలు ఇంకా జరుగుతాయని యల్లేష్ యాదవ్ తెలియజేసారు.

శ్రీపతి ఈదా నియామకం పట్ల హర్షం

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

విశాలాంధ్ర-ఒంగోలు : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు రాష్ట్ర నూతన కమిటీలో ప్రకాశం జిల్లాకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వటం పట్ల ప్రకాశం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నేతలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నేతలు మాట్లాడుతూ అత్యంత సీనియర్ నాయకులు శ్రీపతి ప్రకాశంకి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రెండోసారి కొనసాగిస్తున్నందుకు, ప్రకాశం జిల్లా కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులు ఈదా సుధాకర్ రెడ్డిని మూడోసారి జిల్లా అధ్యక్షులు బాధ్యతలు ఇవ్వడం హర్షణీయమని అన్నారు. పార్టీ కష్ట కాలం నుండి పనిచేస్తున్న శ్రీపతి ప్రకాశం కు ఈదా సుధాకర్ రెడ్డి కు మంచి గుర్తింపు ఉందని అలాగే పిసిసి ప్రధాన కార్యదర్శులుగా ఎస్కే సైదా, పొట్లూరి కొండారెడ్డి,పగడాల రంగస్వామి లకు స్థానం కల్పించడం నేతలు హర్షం వ్యక్తం చేశారు.ఈ పదవులు ఇచ్చినందుకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు కి,పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి కి,ఏఐసిసి కార్యదర్శి సిరివెళ్ల ప్రసాద్ కి నేతల నియామకం పట్ల ధన్యవాదాలు తెలియజేశారు. రాపు ఎన్నికల్లో ఈదా సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఒంగోలు పార్లమెంటు లోని అన్ని అసెంబ్లీలలో ఘనమైన ఫలితాలు సాధిస్తామని రాబోవు రోజుల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడబో తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి శ్రీపతి సతీష్, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు వద్దండి మల్లికార్జునరావు,జిల్లా ఐఎన్టీయూసీ నాయకులు ఉంగరాల శ్రీనివాసరావు, ఒంగోలు మండల కాంగ్రెస్ అధ్యక్షులు తెలగలపూడి బుజ్జి,జిల్లా సేవాదళ్ నాయకులు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

దర్గా ఊరుసు మహోత్సవంలో ఎమ్మెల్యే అన్నా

విశాలాంధ్ర-గిద్దలూరు : నగర పంచాయతీ పరిధిలోని నాయక్ వీధిలో రావి చెట్టు వద్ద వెలసిన శ్రీశ్రీశ్రీ అల్‌అజ్ సయ్యదినా ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ స్వామి దర్గా 19వ ఉరుసు మహొత్సవములో గిద్దలూరు శాసన సభ్యులు అన్నా రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా అల్‌అజ్ సయ్యదినా ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం దర్గా కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అన్నా కు స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అన్నాను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

చెత్త సేకరణ డబ్బాల పంపిణీ : ఎంపీపీ, జెడ్పీటీసీ

విశాలాంధ్ర-కనిగిరి : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమములో భాగముగా సర్పంచులకు పొడి, తడి చెత్త సేకరించే డబ్బాలను ఎంపీపీ దంతులూరి ప్రకాశం జెడ్పిటిసి కస్తూరి రెడ్డి అందజేశారు. ఎంపీపీ దంతులూరి ప్రకాష్ మాట్లాడుతూ కనిగిరి మండలం లోని 25 గ్రామ పంచాయతీలకు చెత్త డబ్బాలను ఆయా సర్పంచ్లకు అందజే స్తామన్నారు. కార్యక్రమములో ఎంపీడీఓ మల్లికార్జునరావు, విస్తరణాధికారి ఓ.అన్నమ్మ, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏఎంసీలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి మార్కెట్ యార్డ్ కమిటీ కార్యాలయంలో శనివారం జిల్లా ఏఎంసీ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం జిల్లా సంయుక్త కార్యదర్శి రవి అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ఉద్యోగులు కమిటీ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అంజనదేవి, బి.రామలింగయ్య, యం.మల్లికార్జున్రెడ్డి, కే.శ్యాంబాబు మాలకొండయ్య , ఫిరోజ్ ఖాసింపీరా, ఇతర ఉద్యోగులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

దసరాకి పండగకి ఊరెళ్లేవారికి ఎస్ఐ హెచ్చరిక

విశాలాంధ్ర-కంభం : కంభం ఎస్ఐ పులి.రాజేష్ కంభం మండల ప్రజలకు దసరా పండుగ సందర్భంగా పలు సలహాలు సూచనలు తెలిపారు. పండుగ నిమిత్తం స్వగ్రామానికి వెళ్ళేవారు తప్పకుండా, స్థానిక పోలీస్ స్టేషన్లో తెలియజేసి వెళ్ళాలని ,లేదంటే తిరిగి వచ్చాక ఖంగుతినే పరిస్థితి ఎదురు కావచ్చని. తాళాలు వేసి ఉన్న ఇళ్లు లక్ష్యంగా దొంగలు రెచ్చిపోయే అవకాశం ఉంటుందని,గతంలో పండుగలకు సొంతూరికి వెళ్లిన వారి ఇళ్లలో దొంగలు మొత్తం దోచుకుపోయిన సంఘటనలు జరిగాయని, తరచూ పండుగల సమయంలో ఊరెళ్లి తిరిగి వచ్చాక దొంగతనాలపై ఫిర్యాదులు అధికంగా నమోదు అయినాయి, కనుక ఇలాంటి పరిస్థితులు ఎదురవకుండా ముందుగానే స్థానిక పోలీస్ స్టేషన్లో తెలియజేయాలని తెలిపారు.

దసరా ఉత్సవాలకు ముత్తుములుకు ఆహ్వానం

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిశాలలో దసరా పండుగ సందర్భంగా నిర్వహించనున్న దేవి నవరాత్రుల ఉత్సవాలకు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని అమ్మవారి శాల ధర్మకర్తలు శనివారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ముత్తుములకు నవరాత్రి ఉత్సవాల పత్రికను అందజేసి తప్పనిసరిగా రావాలని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి శాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ రెడ్డి మృతికి సంతాపం

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని గబ్బులదిన్నె గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు పిచ్చల మాలకొండారెడ్డి గుండెపోటుతో శుక్రవారం రాత్రి హఠాన్మరణం చెందారు. శనివారం కనిగిరి మాజీ మండల అధ్యక్షులు పోతు కొండారెడ్డి, పామూరు మండల వైసీపీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్‌రెడ్డి, మండల బూత్ కమిటీ అధ్యక్షులు గట్ల విజయభాస్కర్ రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ షేక్ ఖాదర్ భాష తదితరులు మాలకొండ రెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాలతో ఘన నివాళులర్పించారు. మాలకొండారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

చంద్రబాబు ప్రాణాలకు రక్షణ కల్పించాలి

సానికొమ్ము తిరుపతిరెడ్డి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాణాలకు రక్షణ కల్పించాలని అలానే ఆయన భద్రతపై తక్షణమే గవర్నర్ కేంద్రం జోక్యం చేసుకోవాలని కనిగిరి నియోజకవర్గ హనుమంతునిపాడు టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు.అలానే చంద్రబాబు నాయుడు వ్యక్తిగత వైద్య బృందాన్ని ఆయన వద్దకు అనుమతించాలని ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలు అందించాలని వారు డిమాండ్ చేశారు.అలానే చంద్రబాబు ప్రాణాలతో వైకాపా ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి అన్నారు.

ఫెయిల్యూర్ విజయాని మొదటి మెట్టు

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : ఫెయిల్యూర్‌ను విజయానికి తొలిమెట్టుగా మలుచుకోవాలని రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ కర్రి రామారెడ్డి అన్నారు. శనివారం ప్రకాశం భవనంలోని స్పందన సమావేశ మందిరంలో యోగా గురువు శ్రీ పతంజలి శ్రీనివాస్ పర్యవేక్షణలో 'నిత్య జీవితంలో విజయ సాధన' అనే అంశంపై రామారెడ్డిచే విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. రామారెడ్డి మాట్లాడుతూ ప్రతి విషయంలోనూ సానుకూల దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. డీఈవో సుబ్బారావు మాట్లాడుతూ ఒక ఫెయిల్యూర్‌తోనే జీవితం ఆగిపోదన్నారు. మన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎవరైతే రాష్ట్రస్థాయి ర్యాంకు సాధిస్తారో వారికి రూ.50వేల బహుమతి ప్రకటించారు. పతాంజలి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల జ్ఞాపకశక్తికి ఉపయోగపడే ప్రణాయామ ములను వివరించారు. రామారెడ్డిని డిఇఓ సుబ్బారావు, పతాం జలి శ్రీనివాస్ సన్మానించారు. కార్యక్రమానికి ఇస్మాయిల్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.